వైభవంగా యాదగిరీశుడి నిత్య తిరుకల్యాణోత్సవం

శ్రీకృష్ణ లీలలు నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

యాదగిరిగుట్ట, జూన్ 29 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. శనివారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.24,38,693 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. స్వామివారి సన్నిధిలో శ్రీవినాయక నాట్య మండలి సురభి వారు శ్రీకృష్ణలీలలు నాటకం ప్రదర్శించారు.

ప్రకృతి జీవనమే సుస్థిర ఆరోగ్యం : డాక్టర్ రామచంద్ర

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్ర

భువనగిరి సిటీ, జూన్ 29 : ప్రకృతిలో మమేకమై జీవనం కొనసాగించడం వల్ల మానవ ఆరోగ్యం సుస్థిరంగా ఉంటుందని ప్రకృతి వైద్యుడు డాక్టర్ రామచంద్ర అన్నారు. పట్టణంలోని రావి భద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఆరోగ్య సదస్సులో ఆయన మాట్లాడారు. జన్యు మార్పిడి కారణంగా విపరీతమైన క్రిమిసంహారక మందులు వాడడం వల్ల మనం తినే ఆహార పదార్థాలు విషతుల్యమై అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. అమ్మే వైద్యురాలు, ఆహారమే ఔషధం, వంట గదే వైద్యశాల అని పేర్కొన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం కోసం ప్రకృతి వైద్యాన్ని ఒక ఉద్యమంలా కొనసాగించడం కోసం ఇబ్రహీంపట్నంలో వినోబా గ్రామం, ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో ప్రకృతి వైద్యశాలలు నడిపిస్తూ ఉచిత వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ సంస్థల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మెరుగు మధు, జీజీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాటూరి అశోక్, ప్రధాన కార్యదర్శి కొత్త బాలరాజు, మహిళా అధ్యక్షురాలు సుర్వి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, మైనారిటీ అధ్యక్షుడు ఎండీ సలావుద్దీన్, యువజన అధ్యక్షుడు పులి వెంకటేశ్, పోతం శెట్టి మంజుల, ఎంపీపీ నరాల నిర్మల, జడ్పీటీసీ బీరు మల్లయ్య, అప్పారావు, మచ్చ కృష్ణగౌడ్, బీడీఎఫ్ నాయకులు ఇమ్రాన్, కౌన్సిలర్ పంగరెక్క స్వామి, సాయి, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ర్యాకల శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్

డాక్టరేట్ అందుకుంటున్న ర్యాకల శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్, జూన్ 29 : సామాజిక సేవలకు గుర్తింపుగా మండలంలోని తాజ్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్ దక్కింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ రిసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ శనివారం గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉన్నదన్నారు. ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని చెప్పారు. భవిష్యత్తులో అందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానన్నారు. కార్యక్రమంలో ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ ఫౌండర్ వి.బాబు విజయన్, కేపీ మనోకరన్, మాజీ ఎమ్మెల్యే ఎస్.జ్ఞానశేఖర్, పాల్గొన్నారు.

ఆందోళ్ మైసమ్మ ఆలయ హుండీ ఆదాయం 10.12లక్షలు

హుండీని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

చౌటుప్పల్ రూరల్, జూన్ 29 : మండలంలోని దండు మల్కాపురం గ్రామంలోని ఆందోళ్ మైసమ్మ దేవాలయ హుండీని ఉమ్మడి నల్లగొండ జిల్లా దేవాదాయ సహాయ కమిషనర్ కె.మహేందర్‌కుమార్ పర్యవేక్షణలో శనివారం లెక్కించారు. వంద రోజుల హుండీ ఆదాయం 10,12,932 రూపాయలు సమకూరినట్లు దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఎస్.మోహన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ అర్చక సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత సాయిచంద్‌కు నివాళి

సాయిచంద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గుండాల, జూన్ 29 : తెలంగాణ మలి దశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ నేత సాయిచంద్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి అన్నారు. సాయిచంద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో శనివారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయిచంద్ తెలంగాణ మలి దశ ఉద్యమంలో తన పాటలతో ప్రజలను చైతన్య పరిచారన్నారు. బీఆర్ఎస్ పార్టీ కోసం ఆయన అహర్నిషలు కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బొంగు శ్రీశైలం, కోలుకొండ రాములు, తాండ్ర శోభన్‌బాబు, బాశెట్టి వీరస్వామి, రాజు పాల్గొన్నారు.

ముత్తిరెడ్డిగూడెంలో పౌరహక్కుల దినోత్సవం

భువనగిరి కలెక్టరేట్ : ముత్తిరెడ్డిగూడెంలో మాట్లాడుతున్న తాసీల్దార్ అంజిరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 29 : మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో తాసీల్దార్ అంజిరెడ్డి అధ్యక్షతన శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో కుల వివక్ష, అంటరానితనాన్ని రూపుమాపాలన్నారు. ప్రతిఒక్కరూ కలిసి మెలిసి ఉండాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది, రూరల్ పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తుర్కలశాపురంలో..

గుండాల : మండలంలోని తుర్కలశాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాలనీ వాసులకు ప్రభుత్వ పథకాలు, మూఢ నమ్మకాలు, బాణామతి, నిరక్షరాస్యత, అణిచివేత, పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలపై ప్రత్యేకంగా వివరించారు. గ్రామ ప్రత్యేకాధికారి పరమేశ్వర్, ఎస్సీ వసతి గృహాల అధికారి రమణారెడ్డి, ఏపీఓ ఇమాన్యుయేల్, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- సర్కారు పాఠశాలల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యమిచ్చాం
- జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

ఉపాధ్యాయుడు నాగార్జునను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎ.నర్సిరెడ్డి, తీన్మార్ మల్లన్న

బొమ్మలరామారం, జూన్ 30 : ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని జలాల్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం పెండెం నాగార్జున, స్కూల్ అసిస్టెంట్ తూముల వెంకటేశ్వర్‌రావు ఉద్యోగ విరమణ అభినందన సభ శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐలయ్య మాట్లాడుతూ విరమణ పొందిన ఉపాధ్యాయులు సమాజ సేవలో గడుపాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల కొరతను అధిగమించడానికి మెగా డీఎస్సీ నిర్వహించి త్వరగా నియామక ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకార మందించాలని కోరారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ విద్య ప్రైవేటీకరణను ఆపాలన్నారు. దేశంలోనే అత్యధికంగా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోకపోతే పేదలకు విద్య అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడుల పరిరక్షణకు విద్యావంతులు ఉద్యమించాలని కోరారు. జడ్పీ చెర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ తన ఐదేండ్ల పదవీ కాలంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యం ఇచ్చానన్నారు. మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. కేజీబీవీలను ఆధునీకరించడంతో వాటిల్లో ఈ సంవత్సరం అడ్మిషన్లకు తీవ్ర పోటీ ఏర్పడిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితంలో వెలుగులు నింపేలా నిరంతరం పని చేస్తానన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుధీర్‌రెడ్డి, ఎంపీడీఓ రాజాత్రివిక్రమ్, మాజీ సర్పంచ్ సంగిశెట్టి వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బొగ్గు గనులను ప్రైవేట్‌కు అప్పగించడం తగదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 29 : మంచిర్యాల జిల్లా శ్రావణపల్లిలోని బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు రంగానికి అప్పజెప్పాలని చూడడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. బొగ్గు గనుల వేలం పాటను నిరసిస్తూ శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సింగరేణి కాలరీస్ బొగ్గు గనుల తవ్వకం కోసమే స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థ అన్నారు. రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలం పాటను ప్రారంభించడం దారుణమని విమర్శించారు. నేషనల్ మానిటైజేషన్ పైపులైన్ పేరుతో దేశంలో ఆరు లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చూస్తున్నదన్నారు. ఈ పదేండ్ల కాలంలో 200కు పైగా గనులను ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, జిల్లా నాయకులు మాటూరు బాలరాజు, దోనూరి నర్సిరెడ్డి, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, నాయకులు స్వామి, నర్సింహ, యాదగిరి, పెంటయ్య, వెంకటేశ్, కృష్ణ, సైదులు, లలిత, పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- అడ్డగూడూరు ఎంపీపీ అంజయ్య

ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు

అడ్డగూడూరు, జూన్ 29 : గ్రామాల్లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ దర్శనాల అంజయ్య అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు నివేదికలను ప్రవేశపెట్టారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తనకు ఎంపీపీగా అవకాశం కల్పించిన ప్రజలకు, మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జూలై 3న పదవీ కాలం ముగుస్తుండడంతో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలను అధికారులు, నాయకులు సన్మానించారు. సమావేశంలో జడ్పీటీసీ శ్రీరాముల జ్యోతీఅయోధ్య, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గుండిగ జోసెఫ్, ఎంపీడీఓ శంకరయ్య, ఎంఈఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీలు పెండెల భారతమ్మ, బట్ట వెంకటయ్య, పాశం యాదమ్మ, మండల కో ఆప్షన్ సభ్యుడు మాదాసు ఆంథోని, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలి

- మున్సిపల్ చైర్మన్ రాజు

సదస్సు కరపత్రం ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్ రూరల్, జూన్ 29 : ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. జూలై ఒకటిన డాక్టర్స్ డే సందర్భంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో చౌటుప్పల్‌లో నిర్వహించే ఆరోగ్య సదస్సు కరపత్రాన్ని శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సదస్సులో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. డాక్టర్లు ప్రభాకర్, కృష్ణారావు, మంజుల పాల్గొన్నారు.

వైభవంగా 29వ ఆత్మ సాక్షాత్కార మహోత్సవం

శివలింగానికి ఘటాభిషేకం నిర్వహిస్తున్న సిద్ధగురు రమణానందా మహర్షి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 29 : జగద్గురు చతుర్వేద జ్ఞానబ్రహ్మ శక్తి పాత సిద్ధయోగీశ్వరులు, శివశక్తి శిరిడీసాయి అనుగ్రహ మహాపీఠాధిపతి సిద్ధగురు రమణానంద మహర్షి జీవాత్మ పరమాత్మలో ఐక్యమైన 29వ ఆత్మ సాక్షాత్కార మహోత్సవాన్ని మండలంలోని నాగిరెడ్డిపల్లి రమణేశ్వరంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులతో మహర్షి ధ్యానం, మార్మికజ్ఞాన ప్రవచనం నిర్వహించారు. 2వేల శివలింగాలకు విశేష ద్రవ్యాలతో ద్విసహస్ర ఘటాభిషేం చేపట్టారు.

పారుపల్లి పాల సొసైటీ పాలకవర్గానికి సత్కారం


పారుపల్లి పాల సొసైటీ పాలకవర్గ సభ్యులను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

రాజాపేట, జూన్ 29 : మండలంలోని పారుపల్లి పాల సొసైటీ నూతన పాలక వర్గాన్ని ఇటీవల ఎన్నుకున్నారు. సొసైటీ పాల కవర్గ సభ్యులు శనివారం యాదగిరిగుట్టలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ జూకంటి వీరయ్య, డైరెక్టర్లను ఎమ్మెల్యే సత్కరించారు. ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాపోలు లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచులు వీరయ్య, బక్కయ్య పాల్గొన్నారు.

రామాజిపేట పాల సంఘం చైర్మన్‌గా దశరథ

యాదగిరిగుట్ట, జూన్ 29 : మండలంలోని రామాజిపేట పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సహాయక సంఘం చైర్మన్‌గా బీఆర్ఎస్ పార్టీకి చెందిన జాగిల్లపురం దశరథ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలో శనివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా కల్లూరి శిరీషాశంకర్‌రెడ్డి, కల్లెపల్లి శ్రీశైలం, ముక్కల నాథం ఎన్నికయ్యారు. అనంతరం చైర్మన్, డైరెక్టర్లను పాడి రైతులు సన్మానించారు. పాల సంఘం డైరెక్టర్లు, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి బాలుడు మృతి

రామన్నపేట, జూన్ 29 : మండలంలోని మునిపంపుల గ్రామంలో పొలం దున్నతున్న ట్రాక్టర్ పైనుంచి పడి బాలుడు మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వనం నరేశ్, శోభ దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. కాగా, శనివారం భార్యాభర్తల మధ్య గొడవ జరుగడంతో శోభ చిన్న కుమారుడిని తీసుకొని తల్లిగారింటికి వెళ్లింది. నరేశ్ తన పెద్ద కుమారుడు గణేశ్ (7)ను పొలం వద్దకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత గణేశ్ తండ్రితోపాటు ఇంటికి వెళ్లకుండా పొలం దున్నతున్న బాబాయి నరేశ్ ట్రాక్టర్‌పై ఎక్కి కూర్చున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గణేశ్ ట్రాక్టర్ పైనుంచి జారిపడగా.. నడుము పైనుంచి వీల్స్ పోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

జూలై 1న రైతు బంధుపై సమీక్ష

ఆత్మకూరు(ఎం), జూన్ 29 : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జూలై 1న రైతుబంధుపై రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రాథమిక సహకార సంఘంలోని సభ్యులు, రైతులు హాజరు కావాలని కోరారు.

జేఎంజే పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ఆలేరు రూరల్, జూన్ 29 : పట్టణంలోని జేఎంజే పాఠశాలలో పాఠ్య పుస్తకాలు అమ్ముతూ అదనంగా డబ్బు వసూలు చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గంగాధర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో పుస్తకాల వ్యాపారం చేస్తున్నా విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. ఎంఈఓ కృష్ణ దృష్టికి తీసుకెళ్లినా తాము ఏమీ చేయలేమని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి జేఎంజే పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు, ఉపాధ్యక్షుడు నరేశ్ పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

బీబీనగర్, జూన్ 29 : మండలంలోని రావిపహాడ్ గ్రామంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మొబైల్ మెడికేర్ యూనిట్ ద్వారా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు చల్ల జయశ్రీ, భవాని రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 68 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు మహేందర్‌రెడ్డి, జిల్లా కమిటీ డైరెక్టర్లు షేక్ హమీద్ పాషా, డివిజన్ కమిటీ సభ్యులు కవిత, ఉపేందర్‌రావు, స్పందన, లావణ్య, వెంకమ్మ, సంతోష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన మధు

మాజీ సీఎం కేసీఆర్‌తో సిలువేరు మధు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 29 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆ పార్టీ యువజన విభాగం జిల్లా నాయకుడు సిలువేరు మధు శనివారం ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట యువజన విభాగం నాయకులు ఉన్నారు.

అనుమతులు లేని ఆహార పదార్థాలను అమ్మవద్దు

- తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి రామకృష్ణ

కిరాణం షాపులో తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి రామకృష్ణ

చౌటుప్పల్ రూరల్, జూన్ 29 : అనుమతులు లేని, కల్తీ ఆహార పదార్థాలను అమ్మవద్దని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి పి.రామకృష్ణ అన్నారు. పట్టణంలోని పలు కిరాణా షాపుల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాల ప్యాకెట్లపై తయారీదారుల చిరునామా, ఎంఆర్‌పీ రేటు, తయారీ తేదీ, తూకం తదితర వివరాలు ఉండాలన్నారు. ఆ వివరాలు లేని ఆహార పదార్థాలు విక్రయిస్తున్న వెంకటేశ్వర కిరాణం, సాయిరాం, రాజా, కామిశెట్టి చంద్రశేఖర్, త్రినేత్ర సూపర్ మార్కెట్‌పై ఐదు కేసులు నమోదు చేశారు. వారికి రూ.75వేల జరిమానా విధించారు. అనుమతులు లేని ఆహహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బోధనా సామర్థ్యం పెంపునకు శిక్షణ

- జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి

శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి

రామన్నపేట, జూన్ 29 : బోధనా సామర్థ్యం పెంపొందించుకోవడం కోసం అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి అన్నారు. మండల కేంద్రంలోని సీడీపీఓ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన శిక్షణలో ఆమె మాట్లాడారు. జాతీయ విద్యా విధానంలో అంగన్‌వాడీ విద్యను చేర్చడం వల్ల మరింత బాధ్యతతో పని చేయాలన్నారు. 3-6 సంవత్సరాల పిల్లలను తప్పకుండా అంగన్‌వాడీలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, వారికి నైపుణ్యంతో కలిగిన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ శాగంటి శైలజ, మాస్టర్ ట్రైనర్ నవనీత, సూపర్‌వైజర్ బాలమణి, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ అశోక్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సేవ చేయడం అలవర్చుకోవాలి : డిప్యూటీ డీఎంహెచ్ఓ

నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీహెంఎచ్ఓ యశోద

చౌటుప్పల్, జూన్ 29 : కండర క్షీణిత వ్యాధిగ్రస్తులకు సేవ చేయడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని డిప్యూటీ డీహెంహెచ్ఓ యశోద అన్నారు. సివియర్ డిజబిలిటీ వెల్ఫేర్ సొసైటీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నాటి స్వప్న, అనిల్ దంపతుల కుమారుడు ఐషాన్ రాజు పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని జయశ్రీ ఫంక్షన్ హాల్‌లో కండర క్షీణిత బాధితులకు శనివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఫిజియోథెరపీతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ ఎన్.శ్రీనివాస్, న్యాయవాది తాడూరి పరమేశ్, సొసైటీ అధ్యక్షులు కత్తుల బాలకృష్ణ, తండ మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

రైతుబంధుపై సలహాల స్వీకరణ

ఆలేరులో రైతులతో మాట్లాడుతున్న డీఏఓ అనూరాధ

ఆలేరు రూరల్, జూన్ 29 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతుబంధుపై డీఏఓ అనూరాధ శనివారం ఆలేరు పీఏస